ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 20.0
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
మంగళవారం 23 జనవరి 2024


మహబూబ్‌నగర్‌లోని గడియారం చౌరస్తాలో నృత్యం చేస్తున్న బాలికలు


ధరూరు మండలం బురెడ్డిపల్లి రామాలయం వద్ద దీపాల అలంకరణ


పాలమూరులోని గడియారం చౌరస్తాలో వేడుకల్లో పాల్గొన్న డీకే అరుణ


పాలమూరు గడియారం చౌరస్తాలో సీతా రాములకు పూజలు చేస్తున్న అర్చకులు


పాలమూరు పాత గంజిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

రామ జపం

అయోధ్య రామ మందిరంలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం ఉమ్మడి జిల్లాలో రామ నామం మారుమోగింది. ఊరూ.. వాడా.. సంబురాల్లో మునిగి తేలింది. ర్యాలీలు, ప్రదర్శనలతో ఎక్కడ చూసినా సందడి నెలకొన్నది. ప్రజలు ఈ ఉత్సవాన్ని టీవీల్లో తిలకించి పులకించిపోయారు. అన్ని పార్టీలు, సంఘాల నాయకులు వేడుకల్లో పాలు పంచుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్


మహబూబ్‌నగర్‌లో సీతా, రామ, లక్ష్మణుడు, హనుమంతుడు, నారదుడి వేషధారణల్లో విద్యార్థులు


వనపర్తి రామాలయంలో శ్రీరాముడికి హారతి ఇస్తున్న పూజారి


మహబూబ్‌నగర్‌లోని గడియారం చౌరస్తాలో ఆంజనేయుడికి మొక్కుతున్న భక్తులు


పాలమూరు గడియారం చౌరస్తాలో..


లింగాలలో కోలాటం వేస్తున్న మహిళలు


పాలమూరులో గీతాలు ఆలపిస్తున్న మహిళలు


అచ్చంపేట ఉమామహేశ్వర ఆలయం వద్ద భక్తుల కిటకిట


అచ్చంపేట కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ


పాలమూరులోని గడియారం చౌరస్తాలో భక్తులకు చేస్తున్న అన్నదానం


అయోధ్యలో మోదీ ప్రసంగిస్తుండగా చిన్నచింతకుంటలో వింటున్న ప్రజలు

చిరుత భయం

- ఖిల్లాఘనపురం మండలంలో ఒకే రోజు ఇద్దరికి కనిపించిన చిరుత
- రెండు సంచరిస్తున్నట్లు అనుమానం
- శనివారం సాయంత్రం షాపూర్ శేషయ్య మేకపిల్లపై దాడి
- ఇప్పటికే పలు పశువులు, జీవాలను చంపిన మృగం
- దానిని బంధించడంలో అటవీ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలు
- భయాందోళనలో ప్రజలు

ఖిల్లాఘణపురం, జనవరి 22: వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలో చిరుతను బంధించడంలో అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మండలంలోని వివిధ ప్రాంతాల్లో రెండు నెలలుగా పశువులు, గొర్రెలు, మేకలపై తరచూ దాడి చేస్తున్నా అటవీశాఖ అధికారులు చిరుత కోసం గాలింపు చేపట్టడం లేదని ప్రజలు అంటున్నారు. మండలంలోని షాపూర్ గ్రామ శివారులో శేషయ్యకు చెందిన మేకపిల్లపై చిరుత శనివారం సాయంత్రం దాడి చేసి, చంపి తిన్నది. మేక పిల్లను వెతికేందుకు వెళ్లగా గుట్టపై ఆదివారం తెల్లవారు జామున చిరుత కనిపించిందని బాధితుడు శేషయ్య తెలిపారు. అదేరోజు పర్వతాపూర్ గ్రామ శివారులోని రైస్ మిల్ దగ్గర గుట్ట ప్రాంతంలో మిల్లు యజమాని నందు ద్విచక్ర వాహనంపై బయటికి వెళ్తుండగా, చిరుత కనిపించడంతో తిరిగి మిల్లులోకి పరిగెత్తినట్లు తెలిపారు. ఒకే రోజు రెండు ప్రాంతాల్లో చిరుత కనిపించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతుండటంతో రెండు చిరుతలు సంచరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రెండు నెలలుగా మండలంలోని పలు చోట్ల పశువులు, జీవాలను చిరుత పులి చంపి తిన్నా, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. చిరుత భయంతో రైతులు పశువులను పొలాల వద్ద కట్టేసేందుకు, మేత మేపేందుకు భయపడుతున్నారు. రాత్రి వేళల్లో పంట పొలాలకు కావలి వెళ్లడానికి జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చిరుతపై నిఘా పెట్టి బంధించాలని కోరుతున్నారు.

స్థావరాలు మారుస్తోంది

చిరుత వివిధ ప్రాంతాల్లో సంచరిస్తుండటంతో నిర్దిష్టంగా గుర్తించలేపోతున్నాం. దాడి జరిగిన ప్రాంతాల్లో గాలింపు చేపట్టినా ఫలితం ఉండటం లేదు. మండలంలో పులి


మూగ జీవాలపై చిరుత తరచుగా దాడి చేస్తున్న మాట వాస్తవమే. దాడుల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. చిరుత దాడిలో మరణించిన జీవాలకు నష్టపరిహారం చెల్లిస్తాం.
- భాస్కరాచారి, అటవీశాఖ డిప్యూటీ రేంజర్

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

కేటీదొడ్డి, జనవరి 22 : విద్యుదాఘాతానికి గురై వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు మృతి చెందిన సంఘటన సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నం దిన్నె గ్రామానికి చెందిన కుర్వ భూలక్ష్మీ(35) తన ఇంటి వద్ద బట్టలు ఆరవేస్తుండగా పక్క నే విద్యుత్ తీగ తెగిపడటాన్ని గమనించి పక్కకు తీసే క్రమంలో షాక్ సంభవించి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు, ముగ్గురు సంతానం ఉన్నారు. అదేవిధంగా, ఇదే మండలంలోని పాతపాలెం గ్రామంలో దౌలత్‌బీ(55) అనే మహిళ వేడినీళ్ల కోసం బకెట్‌లో హీటర్‌ను ఉంచి, నీరు వేడెక్కాయో, లేదోనని తెలుసుకోవడానికి చేయి పెట్టి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. మృతురాలికి భర్తతో పాటు, ఒక కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న జడ్పీ చైర్‌పర్సన్ సరిత జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలోని బాధిత కుటుంబాలను పరామర్శించి, విద్యుత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు ప్రమాదబీమా అందజేసి న్యాయం జరిగేలా చూడాలన్నారు

భయంతోనే దాడికి ప్రయత్నం

- ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డి
- రాహుల్‌గాంధీపై దాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ


వనపర్తిలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న చిన్నారెడ్డి, నాయకులు

వనపర్తి టౌన్, జనవరి 22 : రాహుల్‌గాంధీ చేపట్టిన న్యాయ యాత్రతో బీజేపీ కొంప ముంచుతుందనే భయంతో బీజేపీ నాయకులు దాడికి ప్రయత్నిస్తున్నారని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డి మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్ నుంచి ముంబై వరకు చేపట్టిన న్యాయ యాత్రలో భాగంగా ఆదివారం అస్సాం రాష్ట్రంలో రాహుల్‌గాంధీ, జైరాంరమేష్, అస్సాం పీసీసీ అధ్యక్షుడిపై బీజేపీ గుండాలు దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని అన్నారు. ఇటీవల మణిపూర్ రాష్ట్రంలో జరిగిన అల్లర్లను వ్యతిరేకిస్తూ దేశ సమైక్యతకు సంఘీభావంగా దేశ ప్రజలకు నేనున్నానంటూ రాహుల్‌గాంధీ భరోసా ఇవ్వడానికి యాత్ర మొదలు పెట్టారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వానికి మాత్రం రాహుల్‌గాంధీ యాత్ర వల్ల వెన్నులో వణుకు పుడుతోందన్నారు. భారత్ జోడో యాత్రతో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించిందని, మళ్లీ న్యాయ యాత్ర వల్ల తమ ప్రభుత్వానికి ఎక్కడ ఓటమి కలుగుతుందోననే భయాందోళన బీజేపీ ప్రభుత్వానికి పట్టుకుందన్నారు. దీంతో ఉద్దేశపూర్వకంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పూనుకున్నారని, అయినా కాంగ్రెస్ పార్టీ ప్రతీకార చర్యలు చేపట్టకుండా శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా న్యాయ యాత్రను విజయవంతం చేసి తీరుతామన్నారు. ప్రజాస్వామ్య దేశంలో దాడులకు తావు లేకుండా పరిపాలన సాగించాలని డీసీసీ మాజీ అధ్యక్షుడు శంకర్‌ప్రసాద్ అన్నారు. గాంధీజీని చంపిన గాడ్సేను పూజించే బీజేపీ ప్రభుత్వానికి సిద్ధాంతాలు లేవని, ఎన్నికలు వచ్చిన ప్రతీసారి కార్గిల్, రామజన్మభూమి అంటూ లబ్ధి పొందాలని ప్రయత్నించే ప్రభుత్వం బీజేపీ అని పీసీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ధనలక్ష్మి, ఖమ్మర్ మియా, కదిరె రాములు, బి.కృష్ణ, రమేష్, యాదయ్య, కిరణ్‌కుమార్, ఎండీ.బాబా, సమ్మద్ మియా, చీర్ల జనార్దన్, సేవాదళ్ జానకిరాములు, వెంకటేష్, అబ్దుల్లా, ఎల్లయ్య, ద్యారపోగు విజయ్ బాబు, బెక్కరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణం

- సిరసనగండ్లలో ఘనంగా సీతారాముల వివాహం
- అధిక సంఖ్యలో హాజరైన భక్తులు


సిరసనగండ్లలో కల్యాణం జరిపిస్తున్న పండితులు

చారకొండ, జనవరి 22: అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామాలయంలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా మండల పరిధిలో రెండవ అపర భద్రాదిగా పేరుగాంచిన సిరసనగండ్ల సీతారామ చంద్రస్వామి దేవాలయంలో సోమవారం ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఈవో మల్లెల రఘు ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో దేవాలయం కిటకిటలాడింది. స్వామివారి కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించారు. రామనామస్మరణంతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి పద్మావతి వెంకటేశ్వర ఆలయంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మండలంలో భక్తులు బైకు ర్యాలీతో స్వామివారి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. సర్పంచులు యాతం శారద.శ్రీనివాస్, వసంత.సాంబయ్యగౌడ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు అంగోత్ నరేష్‌నాయక్, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్‌నాయక్, ఆలయ మేనేజర్ నిరంజన్, ఆలయ పూజారులు డేరం మురళీధర్‌శర్మ, డేరం సీతారామశర్మ, డేరం లక్ష్మణశర్మ, డేరం వేణుశర్మ, డేరం కోదండరామశర్మ, డేరం ప్రవీన్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

బల్మూరు, జనవరి 22 : ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


పిల్లి కాశయ్య (ఫైల్)

వరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం పోలిశెట్టిపల్లి గ్రామానికి చెందిన పిల్లికాశయ్య(61) అచ్చంపేట నుంచి తన గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అచ్చంపేట శివారులోని ఏసియన్ గార్డెన్ సమీపంలో రోడ్డుపై అచ్చంపేటకు చెందిన కృష్ణకు సంబంధించిన ట్రాక్టర్ ఆగి ఉండడాన్ని గమనించని కాశయ్య వెనక భాగంలో తీవ్రంగా ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాశయ్యను వాహనదారులు 108 లో అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం మృతుడి కుమారుడు బాలస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కాశయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత, కేసు నమోదు

ఉప్పునుంతల, జనవరి 22 : నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని దుందుబీ వాగు నుంచి సోమవారం అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఇసుకకు సంబంధించి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గురుస్వామి తెలిపారు.

కోస్గి పాలిటెక్నిక్ కళాశాల ఇంజనీరింగ్ కాలేజీగా మార్పు

- ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ
- ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు అమలు

కోస్గి రూరల్, జనవరి 22 : కోస్గి పాలిటెక్నిక్ కళాశాల ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ టెక్నికల్ విద్యాశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో కోస్గి పట్టణవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా కళాశాల ఏఐసీటీఈ అనుమతి కోసం ఈనెల చివరివరకు అవకాశం ఉందని, నేడు దరఖాస్తు చేసుకుంటామని, ఏఐసీటీఈ అనుమతి ఇస్తే ఈ విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు తీసుకుంటామని కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరి తెలిపారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో మొట్టమొదటగా ఇచ్చిన హామీ మేరకు పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్‌గా మార్చారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

ఉప్పునుంతల, జనవరి 22 : ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నేరడు శంకర్ హైదరాబాద్‌కు చెందిన జ్యోతి(25) మూడేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం జ్యోతి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. జ్యోతి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

యువతి అదృశ్యం

మాగనూరు, జనవరి 22 : నారాయణపేట జిల్లా మాగనూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. ఈ మేరకు యువతి తండ్రి సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మల్లేష్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పిన యువతి రాత్రయినా ఇంటికి రాకపోవడంతో ఆమె జాడ కోసం వెతికారు. ఆచూకీ తెలియరాకపోవడంతో ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గండీడ్ మండలంలో తల్లి, కూతురు..

గండీడ్, జనవరి 22 : మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన తల్లి, కూతురు అదృశ్యమయ్యారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భర్త ఎప్పటిలాగే పనిపై ఈనెల 18వ తేదీన బయటకు వెళ్లి ఇంటికి వచ్చి చూడగా భార్య, కూతురు కన్పించలేదు. నాటి నుంచి వారి ఆచూకీ కోసం వెతికినా జాడ తెలియరాకపోవడంతో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



ఉమామహేశ్వరానికి పోటెత్తిన భక్తులు

- చివరి రోజుకు చేరుకున్న బ్రహ్మోత్సవాలు
- ఆలయ ఆవరణలో ఉత్సవమూర్తుల ఊరేగింపు


ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

అచ్చంపేట అర్బన్, జనవరి 22 : శ్రీశైలం ఉత్తరముఖ ద్వారం శ్రీఉమామహేశ్వర క్షేత్రంలో సోమవారం స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉమామహేశ్వరం క్షేత్రంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు కావడంతో హైదరాబాద్, నల్గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమామహేశ్వరున్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొంతమంది భక్తులు భోగమహేశ్వరం నుంచి మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని ఈశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భక్తులు బారులు తీరారు. స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు తీసుకెళ్లి అక్కడ స్వామివారికి గంగాజలంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం గర్భగుడి వరకు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. స్వామివారికి, అమ్మవారికి అభిషేకం సహస్ర నామార్చన, రుద్రాభిషేకం, రుద్రహోమం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్‌లు ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు నీలకంఠం, వీరయ్య, రవికుమార్, చంద్రశేఖర్, రాజశేఖర్‌లు పూజలు చేయించారు. సిబ్బంది రామకృష్ణ, కవికుమార్, రమేష్, శంకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠతో కరసేవకులుగా ధన్యులం

- ఖానాపూర్, వెల్దండ గ్రామాల్లో కరసేవకులకు ఘన సన్మానం


ఖానాపూర్‌లో కరసేవకులను సన్మానించిన గ్రామస్థులు

బిజినేపల్లి/వెల్దండ, జనవరి 22 : రాముడు నడయాడిన అయోధ్యలో రామాలయం నిర్మాణం చేయాలని వేలాదిగా తరలి వెళ్లిన కరసేవకుల్లో మేము సైతం ఉండడంతో ముప్పై ఏళ్లకు అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరగడంతో మా జీవితం ధన్యమైందని 1990, 1992 సంవత్సరాల్లో అయోధ్య వెళ్లిన కరసేవకులు సంతోషం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని ఖానాపూర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో సోమవారం అయోధ్య రామయ్య విగ్రహం ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పెద్ద స్ర్కీన్ ఏర్పాటు చేసి గ్రామ ప్రజలతో కలిసి కరసేవకులు వీక్షించారు. ఈ సందర్భంగా కరసేవకులైన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నెడనూరి దిలీపాచారితో పాటు, తిరుపతయ్య, మోహన్‌రెడ్డి, బాలస్వామి, కృష్ణయ్య, సుధాకర్, రవీందర్‌రెడ్డి, కౌకుంట్ల సుధాకర్, రఘుమారెడ్డి, కృష్ణయ్యగౌడ్, ఆంజనేయులు, రంజిత్‌రెడ్డి, జాకీర్‌హుస్సేన్, అనుపటి కృష్ణయ్య, విష్ణుమూర్తి, నాగరాజు, జయరాములులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అన్నదానం చేపట్టారు.

అదేవిధంగా, వెల్దండ మండలంలో గతంలో కరసేవకులుగా వెళ్లిన యెన్నం విజేందర్‌రెడ్డి, తాటికొండ కృష్ణారెడ్డి, దివంగత యాదయ్య సతీమణి చంద్రకళ, మందగాల వెంకటయ్య, పూరి అంతయ్య తల్లి ఈశ్వరమ్మలను స్థానిక బుధవారపేట ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నాయకులు సన్మానించారు. అంతకుముందు గ్రామంలో భక్తులు భజనలు, కీర్తనలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, బీజేపీ జాతీయ నాయకురాలు బంగారు శ్రుతి, ఎంపీటీసీ సభ్యురాలు ఉమ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, డైరెక్టర్లు మట్ట వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, రాష్ట్ర నాయకుడు చిందం కృష్ణయ్య, కార్యక్రమ నిర్వాహకులు ఉప్పు ఆంజనేయులు, శ్రీధర్, వేణుగోపాలాచారి, శిశుపాల్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాలమూరు, జనవరి 22 : తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాల్లో కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎం.యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మాగారములు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంస్థలు, ధార్మిక, ఇతర ట్రస్టుల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు, కార్మికులకు 2022-23 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన వారికి ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. దరఖాస్తు ఫారాలు సంబంధిత సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఫిబ్రవరి 15వ తేదీలోపు కార్యాలయంలోనే అందజేయాలన్నారు.

పదో తరగతి, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడిసిన్, లా, బీఎస్సీ(అగ్రికల్చర్), బీఎస్సీ(వెటర్నరీ), బీఎస్సీ(నర్సింగ్), బీఎస్సీ(హార్టికల్చర్), బీసీఏ, ఎంసీఏ, బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ, బీబీఏ, ఎంబీఏ, డిప్లమా ఇన్ మెడికల్ లేబొరేటరీ టెక్నీషియన్, పీజీ డిప్లమా ఇన్ మెడికల్ లేబొరేటరీ టెక్నీషియన్ చదువుతూ దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తామని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎం.యాదయ్య తెలిపారు.





చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉప్పునుంతల, జనవరి 22 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన మన్నె శ్రీను(25) గతేడాది డిసెంబరు 30వ తేదీన గ్రామంలో ఓటు వేసేందుకు గాను హైదరాబాద్ నుంచి ఉప్పరిపల్లి గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. ఆమనగల్లు మండలం కడ్తాల్ గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన కారు శ్రీను బైక్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శ్రీను సోమవారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెల్దండ, జనవరి 22 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆటో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఏఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన డేరంగుల బాలస్వామి పెద్దాపూర్ గ్రామంలో మేస్త్రీపని ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా తలకొండపల్లి గ్రామానికి చెందిన అనంతరాములు ఆటోతో బాలస్వామిని ఢీకొట్టాడు. గాయపడ్డ బాలస్వామిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాలస్వామి కుటుంబీకుల ఫిర్యాదుతో ఏఎస్సై శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

దాడిచేసిన వారిపై కేసు నమోదు

వెల్దండ, జనవరి 22 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చౌదర్‌పల్లి గ్రామంలో దంపతులపై దాడిచేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన వెంకటమ్మ, సాయిలు దంపతులపై అదే గ్రామానికి చెందిన మల్లయ్య, పద్మలు పాత గొడవలను మనసులో ఉంచుకుని దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మల్దకల్, జనవరి 22 : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. మల్దకల్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదు మంది పేకాటరాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకుని ఐదు బైక్‌లు, రూ.21,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఏడు మంది పేకాటరాయుళ్లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు ఎస్సై తెలిపారు.

పల్కపల్లి శివారులో చిరుత సంచారం

- భయాందోళనలో రైతులు

అచ్చంపేట అర్బన్, జనవరి 22 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం పల్కపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో ఆదివారం రాత్రి చిరుత సంచరించినట్లు సమీప పొలాల రైతులు ఆందోళనలకు గురయ్యారు. సాయంత్రం వేళ పంట పొలాల్లో రైతులు బాలగౌడ్, అరవింద్‌లు పనిచేస్తుండగా వేగంగా వస్తున్న చిరుతను గమనించి భయాందోళనకు గురయ్యారు. గట్టిగా కేకలు, అరుపులు వేయడంతో చిరుత పారిపోయినట్లు తెలిపారు. సోమవారం ఉదయం చిరుత సంచరించిన జాడలు తెలుసుకున్నారు. అటవీశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చిరుతను బంధించి అడవిలో వదిలివేయాలని రైతులు కోరుతున్నారు.

రెడ్‌క్రాస్‌ను అభినందించిన కలెక్టర్

- ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికెట్ రావడంపై ప్రశంస


ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికెట్‌ను అందుకుంటున్న కలెక్టర్ జి.రవినాయక్

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), జనవరి 22 : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబ్‌నగర్ జిల్లా శాఖను కలెక్టర్ జి.రవినాయక్ అభినందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఉత్తమ నిర్వహణతో పాటు, ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు గాను ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికెట్ రావడంపై కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ జి.రవినాయక్ రెడ్‌క్రాస్ జిల్లా శాఖను అభినందించారు. సోమవారం హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి.ఆలపాటి శివయ్య మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయం సమావేశమందిరంలో కలెక్టర్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖకు ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికెట్ రావడం అభినందనీయమని అన్నారు. జిల్లా శాఖ కమిటీతో పాటు, సభ్యులందరు కష్టపడి పనిచేయడం వల్ల ఐఎస్‌వో సర్టిఫికెట్ వచ్చిందని అన్నారు. హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి ఆలపాటి శివయ్య మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సక్రమ నిర్వహణతో పాటు, క్వాలిటీ, సర్టిఫికేషన్, డాక్యుమెంటేషన్, ప్రొసీజర్, పద్ధతుల అమలు అన్ని విషయాల్లో ముందుందని, తమ బృందం పూర్తి స్థాయిలో సంతృప్తి చెందిన తర్వాతే ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికెట్‌కు ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబ్‌నగర్ శాఖ రక్తదాన శిబిరాల నిర్వహణతో పాటు, ప్రభుత్వ నమోదు, శాంతివనం, సన్నిధి అనాథశ్రమాల నిర్వహణ, సామాజిక కార్యక్రమాల నిర్వహణలో ముందుంది. అంతేకాక జనరిక్ మందులను ప్రజలకు చేర్చడం, అంబులెన్స్‌ల నిర్వహణ వంటి వాటితో పాటు, సామాజిక కార్యక్రమాలు పట్టణ స్థాయి నుంచి గ్రామాలకు విస్తరించిందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షుడు లయన్ నటరాజ్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్యాముల్, కోశాధికారి జగపతిరావు, రెడ్‌క్రాస్ సభ్యులు భీమ్‌రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, డీఆర్వో కేవీవీ.రవికుమార్, జడ్పీ సీఈవో జ్యోతి, డీఆర్‌డీవో యాదయ్య, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ తదితరులున్నారు.

ఫిబ్రవరి 10,11 తేదీల్లో జాతీయ నాస్తిక మేళా

- కరపత్రాలు విడుదల, విజయవంతం చేయాలని సభ్యుల పిలుపు


కరపత్రాలను విడుదల చేస్తున్న నాస్తిక మేళా జిల్లా కమిటీ సభ్యులు

మహబూబ్‌నగర్(క్లాక్‌టవర్), జనవరి 22 : గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని నిడమర్రు చార్వాకాశ్రమంలో ఫిబ్రవరి రెండవ శనివారం, ఆదివారాల్లో జరిగే 32వ జాతీయ నాస్తిక మేళాను విజయవంతం చేయాలని జిల్లా నాస్తిక సమాజం గౌరవ అధ్యక్షుడు యాదయ్య రాష్ట్ర కార్యదర్శి చింతకింది జనార్దన్‌లు కోరారు. ఈ మేరకు సోమవారం వారు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ మేళాలో శాస్త్రీయ, సాంఘీక, హేతువాద, భౌతికవాద, వైద్య రంగాల్లో నైపుణ్యాలు కలిగి పోరాటాలు చేసే వ్యక్తుల ప్రసంగాలు ఉంటాయని, ఏపీ ప్రజా నాట్యమండలి, ప్రజానాస్తిక మండలి, అరుణోదయ మరియు వివిధ ప్రజా సంఘాల కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.విజయకుమార్, కార్యదర్శి ఎం.చెన్నయ్య సభ్యులు ఏ.వెంకటస్వామి, కొనగట్టుపల్లి రవికుమార్ తదితరులున్నారు.

తనయుడి చేతిలో తండ్రి హత్య

వనపర్తి రూరల్, జనవరి 22 : తనయుడి చేతిలో తండ్రి హత్యకు గురైన సంఘటన వనపర్తి జిల్లా పరిధిలోని చిమనగుంటపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై నాగన్న తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన తెలుగు బచ్చయ్య(60)కు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. ప్రతీ సంవత్సరం తండ్రిని ఒకరు పోషించాలి. సోమవారం పెద్ద కుమారుడు కురుమయ్యకు, తండ్రి బచ్చయ్యకు వాగ్వాదం జరిగింది. ఈ వాగ్వాదంలో పెద్ద కుమారుడు కోపంతో పక్కనే ఉన్న గొడ్డలితో గొంతు నరికాడు. ప్రమాదంలో బచ్చయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మరో కుమారుడు చిన్న కురుమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

ధరూరు, జనవరి 22 : షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కురువ కృష్ణమ్మ కురువ వీధి వద్ద గుడిసె వేసుకుని నివాసం ఉంటోంది. సోమవారం ఉదయం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ ఏర్పడి గుడిసె పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రమాదం సంభవించడంతో ప్రాణనష్టం జరగలేదు. గుడిసెలో ఉన్న సామగ్రి, నిత్యావసర సరుకులతో పాటు, నగదు కాలి బూడిదైనట్లు బాధితురాలు వాపోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఖాతూంబీ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితురాలికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయాన్ని కూడా అందిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఆర్ఐ లతీఫ్, సిబ్బంది వెంట ఉన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


కస్పా శంకర్ (ఫైల్)

తెలకపల్లి, జనవరి 22 : మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం బొప్పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కస్పా శంకర్(28)కు 2019 సంవత్సరంలో వట్టిపల్లి గ్రామానికి చెందిన శిరీషతో ప్రేమ వివాహమైంది. వీరికి ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. గతేడాది నుంచి భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు నెలకొన్నాయి. పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టిన వారిలో మార్పు రాలేదు. ఈనెల 20న మళ్లీ పంచాయితీ పెట్టగా పంచాయితీలో భార్య శిరీష, అత్త రాములమ్మలు ఇద్దరు కలిసి శంకర్‌ను అసభ్య పదజాలంతో దూషించి ముఖంపై ఉమ్మి వేశారు. అవమానానికి గురైన శంకర్ మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి తన ఇంట్లో చీరతో సీలింగ్‌కు ఉరి వేసు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న పర్వతాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

పట్టుబడిన గంజాయి

జడ్చర్ల, జనవరి 22 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గొల్లపల్లి గ్రామంలో ఓ వ్యక్తి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. తమకందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం రాత్రి ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని అతన్ని రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. ఇతను 2022లో సైతం కూడా గంజాయిని అమ్ముతూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడినట్లు తెలిపారు.

రింగ్‌బాల్‌లో జాతీయ స్థాయికి కొండూరు విద్యార్థిని ఎంపిక



పెంట్లవెల్లి, జనవరి 22 : నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం కొండూరు గ్రామానికి చెందిన విద్యార్థినీ రుక్షిత రాష్ట్ర స్థాయి రింగ్‌బాల్ పోటీల్లో మొదటి స్థానంలో గెలుపొంది జాతీయ స్థాయికి ఎంపికైంది. ఆదివారం హైదరాబాద్‌లోని కాచిగూడలో జరిగిన రాష్ట్ర స్థాయి రింగ్‌బాల్ పోటీల్లో రుక్షిత పాల్గొన్నది. విద్యార్థిని హైదరాబాద్‌లోని బోరబండ గురుకుల జనరల్ సొసైటీ స్కూల్‌లో చదువుతోంది. రుక్షిత జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు నల్లపోతుల కుర్మయ్య, శశికళతో పాటు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందినట్లు అర్హత పత్రాన్ని చూపిస్తున్న విద్యార్థిని రుక్షిత

ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులు స్వీకరించిన ఫిర్యాదుల పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ధరణికిగాను 9 దరఖాస్తులు వచ్చాయని, మత్స్యశాఖకు ఒక దరఖాస్తు, ఎస్సీ కార్పొరేషన్‌కు ఒకటి, ఎక్సైజ్ శాఖకు ఒకటి, సర్వే శాఖకు ఒకటి, వ్యవసాయ శాఖకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ సోమవారం సైతం ఎప్పటిలాగే భూములకు సంబంధించిన సమస్యలు, ఉద్యోగం, పెన్షన్ మంజూరు తదితర అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కే సీతారామారావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, డీఆర్‌డీవో నర్సింగరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఎంట్రీ ఓటర్లను వెంటనే తొలగించాలి

జిల్లా వ్యాప్తంగా ఓటరు జాబితాలో ఉన్న డబల్ ఓటర్లను తొలగించి తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ధరణి, ఓటర్ల జాబితా, మీసేవ దరఖాస్తులపై తహసీల్దార్లు, ఆర్డీవోలతో జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీఎల్‌వోల వద్ద ఉన్న ఓటరు జాబితా లిస్టులు పరిశీలించి, ఫొటో, డబుల్ ఎంట్రీ ఇతర పొరపాట్లు లేకుండా ఓటరు జాబితాను సరి చేయాలని సూచించారు. జిల్లాలో 9వేలకు పైగా ఓటరు జాబితా పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయని, వాటిన్నింటినీ నేటి సాయంత్రంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. మీ సేవా ద్వారా వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించి దరఖాస్తుదారులకు అందించాల్సిన ధ్రువపత్రాలను వెంటనే జారీ చేయాలని ఆదేశించారు. కల్వకుర్తి నంద్యాల జాతీయ రహదారికి కావాల్సిన భూసేకరణను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, కే.సీతారామారావు, సీసెక్షన్ తహసీల్దార్ జాకీర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

'ఆడపిల్లల చదువే దేశ ప్రగతికి పునాది'

కల్వకుర్తి, జనవరి 22 : బాలికల సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశప్రగతి సాధ్యమని కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలని ఆయన కోరారు. మహిళా శిశు సంక్షేమ సీనియర్ సిటిజన్ డివిజల్ వెల్ఫేర్‌ల శాఖల ఆధ్వర్యంలో బేటీ పడావో బేటీ బచావో జాతీయ బాలిక దినోత్సవాన్ని సీడీపీవో వెంకటమ్మ నేతృత్వంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో నిర్వహించిన కల్వకుర్తి డివిజన్ స్థాయి క్రీడోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, తహసీల్దార్ ఇబ్రహీం, ఎంఈవో బాసునాయక్, పోషణ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ విజ్ఞాన్, జీఈసీవో సూర్య చైతన్యలు హాజరయ్యారు. అనంతరం బేటీ పడావో బేటీ బచావో వాల్ పోస్టర్లను వారు ఆవిష్కరించారు. సాయంత్రం క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. కేజీబీవీ ఎస్‌వో రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, లక్ష్మీ, అరుణ, జ్యోతి, అశ్విని, శ్రీమతి, రషీదా, రేణుక, మల్లేశ్వరీ, ఐసీడీఎస్ ఇన్‌చార్జి డీసీపీవో శ్రీశైలం, జూనియర్ అసిస్టెంట్ హుసేన్, కల్వకుర్తి డివిజన్ పరిధిలోని ఎస్‌వోలు, పీఈటీలు తదితరులు ఉన్నారు.

క్రీడల్లో విద్యార్థినులు రాణించాలి

పెద్దకొత్తపల్లి: విద్యార్థినులు క్రీడల్లో రాణించాలని కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజు, తహసీల్దార్ యూసుఫ్ అలీలు అన్నారు. జాతీయ బాలిక దినోత్సవ వారోత్సవాల్లో మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలోని కేజీబీవీ పాఠశాల, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్, కోడేరు, పెంట్లవెల్లి మండలాల్లోని కేజీబీవీ పాఠశాలలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, రింగ్‌బాల్ పోటీలను ఆర్డీవో నాగరాజు, తహసీల్దార్ యూసుఫ్‌అలీలు ప్రారంభించారు. హెచ్‌ఎం మద్దిలేటి, కస్తూర్బా ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ మల్లురవి సేవను గుర్తించింది'

కొల్లాపూర్, జనవరి 22 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తెచ్చేందుకు అహర్నిషలు కృషి చేసిన పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి సేవలను కాంగ్రెస్ పార్టీ గుర్తించిందని పీసీసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునమోని రాముయాదవ్‌లు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రజాసేవలో సుదీర్ఘమైన అనుభవం కలిగిన మల్లురవిని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పార్టీ మరోసారి అవకాశం కల్పించాలని భారీ మెజార్టీతో మల్లురవిని గెలిపించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కృషి చేస్తామని త్వరలోనే అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు. కొల్లాపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మీనుగ పరుశరామ్‌నాయుడు, పట్టణ అధ్యక్షుడు కాంతారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆధ్యాత్మ రామాయణం గ్రంథావిష్కరణ



ఆధ్యాత్మ రామాయణం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొల్లాపూర్, జనవరి 22 : శ్రీరాముని జీవితం, వారు అనుసరించిన ధర్మమార్గం సకల జనులకు ఆదర్శప్రాయమని తెలుగు భారతి సంస్థ ప్రధాన కార్యదర్శి సాహితీవేత్త వేదార్థం మధుసూదనశర్మ అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ అర్థశాస్త్రవేత్త, కవి, రచయిత డాక్టర్ కర్నాటి లింగయ్య రచించిన ఆధ్యాత్మ రామాయణం గ్రంథాన్ని సోమవారం కొల్లాపూర్ పట్టణంలోని శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో ఆయన ఆవిష్కరించారు. ఆలయ అర్చకులు టీజీ.రాఘవాచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోవిందుగౌడ్, వెంకటయ్య, మల్లయ్య, ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి వి.సీతారాం

నాగర్‌కర్నూల్ టౌన్/ కల్వకుర్తి, జనవరి 22 : రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా ఫుట్‌బాల్ టోర్న మెంట్‌కు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి క్రీడాకారులు పి.అక్షర, పి.ఆనందవర్షిణి, టి.రుత్విక ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను సోమవారం జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి వి.సీతారాం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థినులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ జె.వెంకటరాములు, క్రీడలశాఖ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ఎంపికైన క్రీడాకారుల్లో కల్వకుర్తి పట్టణానికి చెందిన బ్రిలియంట్ స్కూల్ విద్యార్థినీ రుత్విక జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తుందని ప్రిన్సిపాల్ రేణుధర్ తెలిపారు. రుత్వికను బ్రిలియంట్ విద్యా సంస్థల అధినేత, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అభినందించారు.

అంతా రామమయం

జిల్లా అంతటా శ్రీరామ నామ స్మరణ మారుమోగింది. పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా శ్రీరామ యువక బృందం ఆధ్వర్యంలో రాముడి విగ్రహాన్ని డీజే నృత్యాలతో పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

- వైభవంగా శ్రీసీతారాముల కల్యాణం
- శ్రీరామ యూత్ ఆధ్వర్యంలో ఊరేగింపు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 22: అయోధ్య శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా జిల్లా కేంద్రంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, రామనామ స్మరణంతో పట్టణం మార్మోగింది. పట్టణంలోని రామాలయంలో ఆలయ అర్చకులు కందాడై వరదాచార్యులు ఆధ్వర్యంలో శ్రీసీతారామస్వాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రత్యేక దర్శనాలు, తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం శ్రీరామ యువక బృందం ఆధ్వర్యంలో అయోధ్య రాముడి విగ్రహాన్ని డీజే నృత్యాలతో పట్టణ పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. సరస్వతి శిశు మందిర్ పాఠశాల విద్యార్థులు రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమాన్ వేషధారణలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. హౌసింగ్‌బోర్డుకాలనీ శ్రీవెంకటేశ్వర ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అదేవిధంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గుడి ఆవరణంలో అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులకు ప్రత్యక్ష ప్రసారం చేపట్టారు. పట్టణ స్వర్ణకార సంఘం, బులియన్ మర్చంట్, వస్త్ర వ్యాపారుల ఆధ్వర్యంలో సంతబజారులో అయోధ్య రాముడి చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఆవుల రాజుసాగర్ బాటసారులకు ఉచితంగా చెరుకు రసం అందించారు. శ్రీరామ భక్తులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పెనిమిళ్లలో శ్రీరాముని శోభాయాత్ర



ఊర్కొండలోని భ్రమరాంబ ఆలయంలో సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

● ఉప్పునుంతల: మండల కేంద్రమైన ఉప్పునుంతలతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో భక్తులు రాముడు చిత్ర పటాన్ని వాడవాడలో ఊరేగింపుగా తీసుకెళుతూ భజనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ టీవీలో చూసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ అనంతా రెడ్డి, కుమారస్వామి, రమేష్‌రెడ్డి, సత్యనారాయణ, బన్ని, పలువురు ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

● ఊర్కొండ: అయోధ్యలో బలరాముని విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా మండలంలోని వివిధ దేవాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహిక వ్రతాలు చేశారు. అదేవిధంగా గ్రామాల్లోని పురవీధుల్లో రామనామస్మరణతో మారుమోగాయి. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

● లింగాల: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠను పురష్కరించుకొని లింగాలలో భక్తులు అందంగా అలంకరించిన వాహనంలో రాముని చిత్రపటాన్ని ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భజన, కోలాటాల మధ్య శోభాయాత్ర నిర్వహించారు. అంతకు ముందు కోదండరామాలయంలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకులు మహేశ్వరం, సన్నాయిల అశోక్, విష్ణుచారి, గువ్వని నవీన్ తదితరులు పాల్గొన్నారు.

● వంగూరు: అయోధ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో సోమవారం వంగూరులోని హన్‌మాన్ దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నాదాన కార్యక్రమం చేపట్టారు. మండల వ్యాప్తంగా భక్తులు దీపాలను వెలిగించి పండగలా రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. వేణుగోపాల్‌గుప్తా పాల్గొన్నారు.

● తెలకపల్లి: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఊరూరా కాషాయ తోరణాలు ప్రతి ఇంటిపై జెండాలను ఎగురవేశారు. మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించి పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

● అమ్రాబాద్: మండలంలోని వివిధ గ్రామాలలో రామ భక్తులు సోమవారం శోభాయాత్ర ర్యాలీలను నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, అమ్రాబాద్ మాజీ ఎంపీపీ అచ్చిరెడ్డి, స్థానిక మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, గోలి లింగం, గోలి రాజు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



నాగర్‌కర్నూల్‌లోని రామాలయంలో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆలయాల్లో పూజలు



కల్వకుర్తిలో శోభాయాత్ర

కల్వకుర్తి: అయోధ్యలో 500సంవత్సరాల కల నెరవేరి రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని కల్వకుర్తి రామమయంగా మారింది. కల్వకుర్తి పట్టణంతో పాటు మండలంలోని తాండ్ర, అన్ని గ్రామాల్లో దేవాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలరాముని ప్రాణప్రతిష్ఠను ప్రత్యక్షంగా టీవీల ద్వారా వీక్షించేందుకు దేవాలయాల నిర్వాహకులు ఏర్పా ట్లు చేశారు. కల్వకుర్తి పట్టణంలో జరిగిన శోభాయా త్రలో హిందూ సంస్థలు, నాయకులు, ప్రజలు, యు వకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

తాండ్ర గ్రామంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశా దీప్‌రెడ్డి దంపతులు, పలువురు నాయకులు హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంతోపాటు మండలంలోని అన్ని దేవాలయాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ మునిసిపల్ చైర్మన్ శ్రీశైలం, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మొగిలి దుర్గాప్రసాద్‌లతోపాటు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నల్లమలలో ప్రతిధ్వనించిన శ్రీరామ నామం

అచ్చంపేట: అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా నల్లమలలో శ్రీరామనామస్మరణతో సోమవారం ప్రతిధ్వనించింది. నియోజకవర్గంలోని అన్ని మండల గ్రామాల్లో ఆలయాలను ఆయా కమిటీల నిర్వాహకుల ఆధ్వర్యంలో శుద్ధిచేసి పచ్చని తోరణాలు కట్టి సీతరామ లక్ష్మణులకు అభిషేకాలు, పుష్పాభిషేకం, ఆయా ఆలయాల భ్రమరాంబికాదేవి కమిటీ అధ్యక్షులు నల్లపు శ్రీనివాసులు, పునఃనిర్మాణ కమిటీ అధ్యక్షుడు మనోహర్, మహిళా కమిటీ అధ్యక్షులు సత్యమ్మ, శ్రీదేవి, శివపార్వతులు, కన్యకాపరమేశ్వరి ఆలయ అధ్యక్షులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అదేవిధంగా భక్తమార్కండేయ, సాయిబాబ ఆలయాలలో అర్చకులు ఉదయ్‌భాస్కర్, కాటేపల్లి శ్రీనివాస్‌లు, విశ్వనాథ్ శాస్త్రీ, వేదపండితుల మంత్రోచ్ఛారణలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అర్చనలు, భజనలతో ఆలయాలు మారుమోగాయి.

అచ్చంపేట మండలంలో..

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అయోధ్య శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతీ గ్రామాల్లో ఆలయాలను ఆయా కమిటీల నిర్వాహకుల ఆధ్వర్యంలో శుద్ధి చేసి పచ్చని తోరణాలు కట్టి సీతారామ లక్ష్మణులకు అభిషేకాలు, పుష్పాభిషేకం నిర్వహించారు. పల్కపల్లి, నడింపల్లి, లింగోటం, హాజీపూర్, సిద్దాపూర్, బొమ్మనపల్లి గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాలలో భజనలు, కీర్తనలతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పెనిమిళ్లలో శ్రీరాముని శోభాయాత్ర సాగింది.

విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

కొల్లాపూర్: అయోధ్యలో రామ్‌లల్లా బాలరాముని ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా పట్టణంలోని రామమందిరం, మాధవస్వామి దేవాలయం, శివాలయం, వేంకటేశ్వరాలయాల్లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. పట్టణంలోని రామమందిరం ఆలయంలో రామ్‌లల్లా బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి లైవ్ ద్వారా శ్రీరాముని భక్తులు కనులారా వీక్షించారు. రామాలయం నుంచి పట్టణ పురవీధుల గుండా విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పట్టణంలో మోటారు బైక్ ర్యాలీ నిర్వహించి శ్రీరాముని నినాదాలు చేశారు. రామమందిరంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 500సంవత్సరాల సుదీర్ఘ సమస్యను భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవం జరగడం హర్షించదగ్గ విషయమని బజరంగ్ దళ్ జిల్లా నాయకుడు సుంకరి పురేందర్ పేర్కొన్నారు.

పట్టణంలోని రామమందిరం ఆలయంలో సాయంత్రం భారీ ఎత్తున నృత్యాలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో శోభాయాత్ర నిర్వహించారు. అదేవిధంగా కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం, కుడికిళ్ల, సోమశిల, ఎల్లూరు గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కాషాయ జెండాలు చేతపట్టుకుని ఊరేగింపు నిర్వహించారు.



కొల్లాపూర్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు

సీతారాముల ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

తిమ్మాజిపేట, జనవరి 22 : సీతారాముల ఆశీస్సులు కరుణ కటాక్షాలు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిలు అన్నారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని బావాజీపల్లిలో సోమవారం సీతారామచంద్ర స్వామి ఆలయంలో నిర్వహించిన ఆంజనేయస్వామి శివాలయం గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహార్తులు, నాగ ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని ఎమ్మెల్యేలు హోమంలో పూర్ణాహుతిని వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులనుద్దేశించి మాట్లాడారు. అంతకు ముందు ఆలయ కమిటీ సభ్యులు, వైస్ ఎంపీపీ సర్పంచ్, ఆయా పార్టీల నాయకులు, భక్తులు ఎమ్మెల్యేలకు శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికా రు. అలాగే, అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం తిమ్మాజిపేట మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో వేణుగోపాల స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులనుద్దేశించి మాట్లాడారు. పీసీసీ సభ్యుడు మల్లయ్యగౌడ్, ఎంపీటీసీ తిరుపతయ్య, సర్పంచ్ బాలరాజు, నాయకులు మాసిరెడ్డి, జంగిరెడ్డి, రాజ్‌కుమార్, రాఘవేందర్, చిన్న రాములు, తిరుపతయ్య, లక్ష్మయ్య, కృష్ణయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



బావాజీపల్లిలో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి

దైవచింతనతో మానసిక ప్రశాంతత

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జనవరి 22 : దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణ పరిధిలోని సిలార్‌పల్లిలో ఠాగూర్ యూత్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి, గౌతమబుద్ధుని విగ్రహాల ఏర్పాటుకు, గ్రామ ముఖ ద్వారానికి భూమి పూజ కార్యక్రమాలు సోమవారం రాత్రి నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిలార్‌పల్లిలో ఠాగూర్ యూత్ ఫౌండర్ చిగుళ్లపల్లి సతీష్‌కుమార్, యూత్ సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆదర్శంగా ముందుకు సాగుతున్నారని అభినందించారు. సతీష్‌కుమార్ సొంత ఖర్చుతో సిల్లార్‌పల్లిలోని నిరుపేదలకు ప్రతి నెల 9కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేయడం, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సైకిళ్లు అందించడం అభినందనీయమన్నారు. కల్వకుర్తి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బృంగి ఆనంద్‌కుమార్, మాజీ సర్పంచ్ పసుల సుదర్శన్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, స్థానిక కౌన్సిలర్ విజయలక్ష్మీ, బుచ్చయ్య, సీహెచ్ సతీష్‌కుమార్, నాయకులు, ఠాగూర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కల్వకుర్తి పట్టణంలో రామాంజనేయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేశారు.



ఆంజనేయస్వామి విగ్రహ స్థాపనకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- మండల సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల, జనవరి 22: గతంలో చేసిన తప్పిదాలను పునరావృతం చేయకుండా గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లింగమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఎజెండాలో పొందుపర్చిన అంశాలను సభ్యులకు వివరించారు. ఎజెండాలో కొన్ని తప్పిదాలు వస్తున్నాయని, వాటిని సరిదిద్దుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కొత్తచెర్వుతండా, కోమటికుంటలో మిషన్‌భగీరథ పనులు అసంపూర్తిగా ఉన్నాయని సర్పంచులు మల్లేష్, గుడిబచ్చన్న తెలిపారు. పనులను పరిశీలించి సరిచేయాలని ఎమ్మెల్యే సంబంధిత ఏఈని ఆదేశించారు. భూముల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ధరణి స్థానంలో త్వరలో భూమాత పోర్టల్ అందుబాటులోకి రానుందని ఎమ్మెల్యే అన్నారు. మండలంలో 100ఎకరాల స్థలంలో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలను ఏ ర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. వైస్ ఎంపీపీ నారాయణగౌడు, సింగిల్‌విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎంపీడీవో గీతాంజలి, తహసీల్దార్ ఉమా, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హేమలత, పలుశాఖల ఏఈలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

అన్ని రంగాలలో రాణించాలి

బాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కోరారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురష్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో ఏర్పాటు చేసిన అచ్చంపేట డివిజన్ స్థాయి క్రీడలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ పోటీలలో డివిజన్‌లోని లింగాల, బల్మూర్, ఉప్పునుంతల, పదర, అమ్రాబాద్ అచ్చంపేట మండలాలకు చెందిన కస్తూర్బా విద్యార్థినులు కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్ పోటీలలో ప్రతిభ కనబర్చారు. జిల్లా కన్వీనర్ పాండు, ఎస్‌వో శారద, హెచ్‌ఎం శేఖర్, ఎంపీపీ లింగమ్మ, వైస్ ఎంపీపీ నారాయణగౌడు, తహసీల్దార్ ఉమా, కోఆప్షన్ సభ్యుడు షఫీ, నాయకులు కేటీ తిరుపతయ్య, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రాథోడ్, ఇందిరమ్మ, మల్లయ్య, లక్ష్మన్‌నాయక్, జ్ఞానేశ్వర్‌రెడ్డి, తేజ, తిరుపతయ్య రాజేష్ ఆయా మండలాల పీఈటీలు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

- పోటీలలో విజేతలు

ఖోఖోలో లింగాల కేజీబీవీ జట్టు మొదటి బహుమతి, రాయలగండి కేజీబీవీ జట్టు రెండవ బహుమతిని సాధించగా, కబడ్డీలో ఉప్పునుంతల కేజీబీవీ జట్టు మొదటి బహుమతి, అచ్చంపేట కేజీబీవీ జట్టు రెండవ బహుమతి సాధించారు. టెన్నికాయిట్ పోటీలలో మొదటి బహుమతిని కేజీబీవీ లింగాల, రెండవ బహుమతిని కేజీబీవీ ఉప్పునుంతల పాఠశాలకు చెందిన జట్టు ప్రతిభ కనబర్చినట్లు ఎస్‌వో తెలిపారు.

కోలాట బృందానికి బహుమతులు అందజేత

● వంగూరు: మండలంలోని కోనేటిపూర్‌లో ఆదివారం రాత్రి కోలాట బృందానికి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ బహుమతులు అందజేశారు. పండిత్‌రావు, పాండురంగారెడ్డి, రంగారావు, వెంకటయ్య, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

తెలకపల్లి, జనవరి 22 : హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నాగర్‌కర్నూల్ జిల్లా సివిల్ సప్లయ్ హమాలీల జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్మిక చట్టాలలో మార్పులను వ్యతిరేకిస్తూ బీజేపీ మతోన్మాద పెట్టుబడిదారీ అనుకూల ఆర్థిక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వర్ధం పర్వతాలు, సివిల్ సప్లయ్ హమాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలయ్య పాల్గొన్నారు.

'ఎంపీ టికెట్ వెంకటేష్‌కు కేటాయించాలి'

ఉప్పునుంతల, జనవరి 22: నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ చారకొండ వెంకటేష్‌కు కేటాయించాలని ఉప్పునుంతల కాంగ్రెస్ నాయకుడు విజేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ బలోపేతం కోసం, పార్టీ అధికారం కోసం కృషి చేసిన నాయకుడిని గుర్తించి టికెట్ కేటాయించాలని ఆయన కాంగ్రెస్ కోరారు.

క్రికెట్ టోర్నమెంటులో గెలుపొందిన జట్లకు నగదు బహుమతులు

ఉప్పునుంతల, జనవరి 22: మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటులో గెలుపొందిన జట్లకు ఆదివారం నగదు బహుమతులు సర్పంచ్ లక్ష్మీనారాయణ అందచేశారు. కంసానిపల్లి అంబేడ్కర్ సీపీ టీం పైన ఉప్పునుంతల పంచాయితీ సెక్రటరీ టీం విజయం సాధించారు. విజయం సాధించిన టీంకు న్యాయవాది కంసానిపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణ మొదటి బహుమతి 20 వేలు అందచేశారు. రన్నరప్ టీంకు కాంపల్లి ఆనంద్ రెండవ బహుమతి 10 వేలు, గ్రైండ్ క్లీన్ టీంకు కొట్టే శ్రీనివాసులు 10 వేలు, బాల్స్ కోసం కురమయ్య 5 వేలు అందచేశారు. నిర్వాహకులు షైబు, రామస్వామి, రాజేష్ ఉన్నారు.

తాగునీటి సమస్యపై కలెక్టర్‌కు వినతి

దోమలపెంట, జనవరి 22: అమ్రాబాద్ మండల పరిధిలోని వటువర్లపల్లి గ్రా మంలో నెలకొన్న తాగునీటి సమస్యలపై సర్పంచ్ చత్రునాయక్ సోమవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి గ్రామంలో తాగునీటి తీవ్రసమస్యగా ఉందని ఆయనను సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ స్పందించి తక్షణ గ్రామ ప్రజల ప్రయోజనాల కోసం బోరు మోటారు మంజూరు చేయడం జరిగిందన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

తాడూరు, జనవరి 22 : మండల కేంద్రంలోని కేజీబీవీ సమీపంలో ఉన్న రైతువేదికలో జాతీయ బాలిక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గత కొన్ని రోజులుగా నియోజకవర్గ స్థాయిలో ఉన్న ఐదు మండలాలకు సంబంధించిన కేజీబీవీల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు జడ్పీటీసీ సభ్యురాలు రోహిణి, ఎంపీడీవో గంగామోహన్‌ల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వజనతోపాటు పీఈటీలు మధుసూదన్‌రెడ్డి, షీటీమ్ వెంకటయ్య, నియోజకవర్గంలోని ఐదు కేజీబీవీల ఎస్‌వోలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు రేణుక ఉన్నారు.

సమస్యలు పరిష్కరించుకోవాలి

పెంట్లవెల్లి, జనవరి 22 : గ్రామంలోని సమస్యలు గ్రామసభ ద్వారా పరిష్కరించుకోవాలని మల్లేశ్వరం గ్రామ సర్పంచ్ తిరుపాటి నాగరాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని మల్లేశ్వరం గ్రామంలో గ్రామసభ సమావేశం నిర్వహించారు. ఉప సర్పంచ్ నరసింహ, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, గ్రామ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'వంశీకృష్ణకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి'

అమ్రాబాద్ జనవరి22: అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ అచ్చంపేట నియోజకవర్గం అధ్యక్షుడు చింతలు రాజగోపాల్ , జిల్లా కాంగ్రెస్ నాయకులు కుందా మల్లికార్జున్, దమర్ల రాజులు కాంగ్రెస్ అధిష్ఠానానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం అమ్రాబాద్‌లో వారు విలేకరులతో మాట్లాడారు.